సాక్షి నిజామాబాద్

శనివారం । 2 । డిసెంబర్ । 2023



వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..
రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆ పార్టీ అర్బన్ అభ్యర్థి షబ్బీర్ అలీ ధీమా వ్యక్తం చేశారు.
- 8లో ▸



పోరులో గెలుపెవరిదో..!
ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్ ముగియడంతో అభ్యర్థులు తమ గెలుపు ఓటములపై లెక్కలేసుకుంటున్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
29.5 /19.7

వాతావరణం
ఆకాశం మబ్బు పట్టి ఉండవచ్చు. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం చల్లటిగాలులు వీస్తాయి. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

జిల్లాలో 74.68 శాతం పోలింగ్

సుభాష్‌నగర్ : రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సగటున 74.68 శాతం పోలింగ్ నమోదైందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్మూర్‌లో 76.02శాతం, బోధన్‌లో 77.92, బాన్సువాడలో 81.29, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో 61.66, నిజామాబాద్ రూరల్‌లో 76.43, బాల్కొండలో 79.72శాతం ఓటింగ్ నమోదైందని వెల్లడించారు.

కొత్త మద్యం షాపులు ప్రారంభం

- ఆగస్టులో టెండర్లు పూర్తి
- ఎన్నికల కోడ్‌తో ఆగిన లైసెన్స్‌లు

ఖలీల్‌వాడి : జిల్లాలో కొత్త ఎక్సైజ్ పాలసీ ప్రకారం కొత్త వైన్‌షాప్‌లు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆగస్టులో ఎక్సైజ్ శాఖ 102 వైన్ షాప్‌లను లక్కీ డా ద్వారా ఎంపిక చేసింది. పాత వైన్ యజమానులు గడువు నవంబర్ 30తో ముగిసింది. కొత్త వైన్స్‌లకు శుక్రవారం నుంచి మద్యం సరఫరా చేయాల్సి ఉండగా ఎన్నికల కోడ్ రావడంతో బ్రేక్ పడింది. రాష్ట్ర ఎక్సైజ్ అధికారుల సూచనల మేరకు కొత్తగా వైన్స్‌లు పొందిన యజమానులకు 1/3శాతం మద్యంను అందించేందుకు నిర్ణయించారు. దీంతో మద్యం వ్యాపారులు శుక్రవారం మద్యం షాపులను ప్రారంభించారు. ఎన్నికల కోడ్ ఉండడంతో జిల్లా అధికారులు 102 వైన్‌షాప్‌లకు దశలవారీగా మద్యం సరఫరా చేస్తున్నారు. ఈనెల 3న శాసనసభ స్థానాలకు ఓట్ల లెక్కింపు ఉండడంతో వైన్‌షాప్‌లకు రెండు రోజుల పాటు మూసివేసే అవకాశాలు ఉన్నందున మద్యంను అధికారులు షాపులకు తక్కువగా తరలించినట్లు తెలిసింది.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి



నిజామాబాద్‌అర్బన్ : ఎయిడ్స్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా సీనియర్ జడ్జి పద్మావతి అన్నారు. శుక్రవారం గిరిరాజ్ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినం 2023 సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరై ప్రసంగించారు. ఈ ఏడాది ఇద్దరు ట్రాన్స్‌జెండర్స్‌కు ఒక సెక్స్ వర్కర్‌కు ఉద్యోగాలు లేబర్ కార్స్ ఇప్పించామన్నారు. అనంతరం జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుదర్శనం మాట్లాడుతూ జిల్లాలో గతంలో హెచ్‌ఐవి కేసులు 5.4 శాతం నుంచి 0.39 వరకు తగ్గించగలిగామన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినంలో భాగంగా కళాశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కిరణ్ కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, జైలర్ రాజశేఖర్ రెడ్డి, ఎన్‌వైకే కోఆర్డినేటర్ శైలి బెల్లాల్, గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య పాల్గొన్నారు.

పొలిటికల్ బెట్టింగ్..

- రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలపై జోరుగా పందాలు
- నియోజకవర్గాల వారీగా గెలుపోటములపై బెట్టింగ్‌లు
- త్రిముఖ పోటీ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఉత్కంఠ
- కామారెడ్డిలో గెలుపోటములపై మరింత ఆసక్తి

పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ఓట్ల లెక్కింపు కోసం పార్టీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలే కాకుండా సాధారణ ఓటర్లు కూడా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. శాసనసభ ఎన్నికలు కావడంతో రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కానుందనే విషయమై ప్రతిఒక్కరిలోనూ ఆసక్తి నెలకొంది.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఉమ్మడిజిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ప్రతినియోజకవర్గంలోనూ త్రిముఖ పోరు ఉండడంతో ఈ ఆదివారం విడుదలయ్యే ఫలితాలపై జోరుగా చర్చించుకుంటున్నారు. ఇదే అదనుగా బెట్టింగ్‌రాయుళ్లు జోరుగా పందాలు కాస్తున్నారు.

సోషల్ మీడియా విస్తృతంగా వాడుకలోకి వచ్చాక ప్రతి చిన్న స్థానిక అంశం నుంచి జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ప్రతిఒక్కరూ చర్చ చేయడం సాధారణమైంది. ఈ క్రమంలో అత్యంత కీలకమైన, ప్రతిఒక్కరిని ప్రభావితం చేసే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు, ఆయా నియోజకవర్గాల్లో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారనే విషయమై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో పోలింగ్ పూర్తయ్యేవరకు ఎన్నికలపై ఒక లెక్క ఉంటే పోలింగ్ పూర్తయ్యాక మరో లెక్కన ఎవరివిశ్లేషణలు వారు చేస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రాష్ట్రంలో ఏ జిల్లాలో లేనివిధంగా అన్ని నియోజకవర్గాల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మధ్య త్రిముఖ పోరు నెలకొంది. ఈ నేపథ్యంలో దాదాపు సగం నియోజకవర్గాల్లో ఫలితం అంచనాలకు అందకపోవడంతో కూడికలు, తీసివేతలతో ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లాలోని కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోటీ పడగా, వీరిద్దరినీ.. రెండు కొండలను ఢీకొట్టే పొట్టేలు మాదిరిగా బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఎదుర్కొంటున్నారు. దీంతో ఈ ఫలితంపై ఈ నియోజకవర్గ ఓటర్ల నాడి అంతుపట్టని విధంగా ఉంది. ముగ్గురు అభ్యర్థుల్లో ఎవరు మొదటి స్థానంలో, ఎవరు ద్వితీయ స్థానంలో, మరెవరు తృతీయ స్థానంలో ఉంటారనే విషయమై లెక్కలు వేసుకునే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఈ ఫలితంపై ఆసక్తి నెలకొంది. దీంతో దీనిపై భారీ స్థాయిలో బెట్టింగులకు తెరలేచింది.

ఎగ్జిట్ పోల్స్ నేపథ్యంలో..


ఇక రాష్ట్రంలో ఆయా పార్టీలు గెలుచుకునే సీట్లు ఇవేనంటూ వివిధ సర్వే సంస్థలు ఎగ్జిగ్ పోల్ ఫలితాలు వెలువరించడంతో ఫలితాలపై మరింత ఆసక్తి నెలకొంది. ఈ ఎగ్జిగ్ పోల్స్ విషయమై సైతం బెట్టింగ్‌లు నడుస్తుండడం విశేషం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి గంటను లెక్కపెట్టుకుంటూ ఓట్ల లెక్కింపు కోసం కళ్లల్లో వత్తులు వేసుకుని మరీ ఎదురు చూస్తున్నారు. కొందరైతే ఆయా ఫలితాలపై బెట్టింగులు పెడుతున్నాం.. పరిస్థితి ఏవిధంగా ఉంటుందంటూ స్నేహితులకు ఫోన్లు చేసి మరీ తెలుసుకుని బెట్టింగ్‌లోకి దిగుతుండడం గమనార్హం.

కూడికలు.. తీసివేతలు

ఉమ్మడి జిల్లాలో పలు స్థానాల్లో త్రిముఖ పోటీ కారణంగా ఎవరి ఓట్లు ఎవరు చీలుస్తారు.. కూడికలు, తీసివేతల నేపథ్యంలో ఎవరు గెలు పొందుతారనే విషయమై ఉత్కంఠ నెలకొంది. దీంతో ఆయా నియోజకవర్గాల వారీగా బెట్టింగ్ రాయుళ్లతో పాటు సాధారణ వ్యక్తులు, యువకులు, మహిళలు సైతం ఎక్కడికక్కడ బెట్టింగులు వేసుకుంటున్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది.. ఆయా పార్టీలకు ఎన్ని సీట్లు వస్తాయి. ఒకే పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందా.. హంగ్ వస్తుందా.. అనే విషయాలపై బెట్టింగ్‌లు పెట్టుకుంటున్నారు. మరోవైపు ఆయా నియోజకవర్గాల్లో ఏపార్టీ అభ్యర్థి గెలుస్తారు.. ఎంత మెజారిటీ వస్తుంది.. ఏ అభ్యర్థి రెండు, మూడో స్థానాల్లో నిలుస్తారనే విషయమై సైతం వివిధ రకాలుగా బెట్టింగ్‌లు నడుస్తుండడం గమనార్హం.

మీట నొక్కలేదు..

- 8 నియోజకవర్గాల్లో తగ్గిన పోలింగ్
- 2018 ఎన్నికలతో పోలిస్తే తీసికట్టే..
- నిజామాబాద్ అర్బన్‌లో మారని తీరు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శాసనసభ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఓటింగ్ శాతం తగ్గింది. పోలింగ్‌లో నమోదైన ఓట్ల తుది గణాంకాలను ఎన్నికల సంఘం వెలువరించింది. బాల్కొండ నియోజకవర్గంలో 2018 ఎన్నికల్లో నమోదైన పోలింగ్‌కు కేవలం నామమాత్రంగా 0.02 శాతం ఎక్కువగా నమోదైంది. మిగిలిన 8 నియోజకవర్గాల్లో మాత్రం పోలింగ్ శాతం మరింత తగ్గిపోయింది. అర్బన్‌లో గత ఎన్నికల్లో 62.65 శాతం పోలింగ్ నమోదు కాగా ప్రస్తుతం 61.66 శాతం మాత్రమే నమోదైంది. నిజామాబాద్ రూరల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్, బోధన్, ఆర్మూర్ నియోజకవర్గాల్లోనూ పోలింగ్ శాతం గత ఎన్నికలతో పోలిస్తే తక్కువగా నమోదైంది.

9 నియోజకవర్గాల్లో పోలైన ఓట్లు..

సెగ్మెంట్	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
ఆర్మూర్	2,10,217	1,59,804	76.02
బోధన్	2,20,068	1,71,478	77.92
జుక్కల్	1,99,962	1,63,569	81.80
బాన్సువాడ	1,95,191	1,57,663	81.29
ఎల్లారెడ్డి	2,20,531	1,83,414	83.17
కామారెడ్డి	2,52,460	1,90,811	75.58
నిజామాబాద్ అర్బన్	2,94,832	1,81,808	61.66
నిజామాబాద్ రూరల్	2,53,233	1,93,556	76.43
బాల్కొండ	2,21,445	1,76,526	79.72

4 నుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా ఈనెల 4వ తేదీ నుంచి బియ్యం పంపిణీ చేయనున్నారు. ఆహార భద్రత కార్డులపై ఒక్కొక్కరికి 6 కిలోలు, అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం అందించనున్నారు.

నిలకడగా భూగర్భ జలాలు

- గత నెలతో పోలిస్తే స్వల్పంగా తగ్గిన నీటిమట్టం

డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లాలో భూగర్భ జలాలు నిలకడగా ఉన్నాయి. ఐదారు ప్రాంతాలు మినహా మిగతా అన్ని చోట్ల నీటి మట్టాలు స్థిరంగా ఉన్నాయి. ఐతే, నాలుగైదు గ్రామాల్లో కొంతమేర భూగర్భ జలాలు పెరగడం విశేషం. ఈ మేరకు జిల్లా భూగర్భ జల శాఖ అధికారులు నవంబర్‌కు సంబంధించిన నీటి స్థాయి లెక్కలను విడుదల చేశారు. ప్రస్తుతం సగటున జిల్లాలో 7.22 మీటర్ల వద్ద భూగర్భ జలాలు ఉన్నట్లు వెల్లడించారు. గత నెలతో పోలిస్తే జలాలు 0.21 మీటర్లు కిందికి వెళ్లగా, ఇదే సమయానికి గతేడాదితో పోలిస్తే 1.08 మీటర్లు తగ్గింది. అత్యధికంగా భీమ్‌గల్ మండలం గోనుగొప్పులలో 7.16 మీటర్ల లోతులో నీటి మట్టాలు ఉన్నాయి. ఎడపల్లి మండలం ఠాణాకలాన్‌లో 0.04, కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో 0.32, ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లిలో 0.86, వేల్పూర్ మండలం రామన్నపేట్‌లో 0.43, ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్‌లో 0.07 మీటర్ల లోతులోకి జలాలు తగ్గిపోయాయి. అదే విధంగా నిజామాబాద్ కంఠేశ్వర్ ప్రాంతంతో పాటు ఆలూర్ మండలం మచ్చర్ల, నవీపేట్ మండలం నిజాంపూర్, భీమ్‌గల్ మండలం మెండోరా, వర్ని, రుద్రూర్ గ్రామాల్లో స్వల్పంగా భూగర్భ జలాలు పెరిగాయి.



జిల్లా వ్యాప్తంగా 33 మండలాల్లో 81 ఫీజో మీటర్లు ఉన్నాయి. ఇందులో 62 ఫీజో మీటర్లలో 10 మీటర్ల వద్ద, 15 ఫీజో మీటర్లలో 10–15 మీటర్ల వద్ద, అలాగే నాలుగు ఫీజో మీటర్లలో 15–20 మీటర్ల వద్ద భూగర్భ జలాలు ఉన్నట్లు సంబంధిత శాఖ వెల్లడించింది.

రూ. కోట్లు పంచేశారు..

- జిల్లాలో అభ్యర్థుల ఖర్చు రూ.600ల కోట్లు దాటిన వైనం
- లెక్కలు వేసుకుంటున్న ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు
- ఒక్కో అభ్యర్థి రూ. 40 కోట్ల నుంచి రూ. 60 కోట్ల వరకు ఖర్చు..!
- జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఒకేవిధంగా అభ్యర్థుల వ్యయం



మోర్తాడ్(బాల్కొండ) : సాధారణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిపోవడంతో తాము చేసిన ఖర్చులపై అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారని తెలుస్తుంది. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో పోటీచేసిన ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు గెలుపు కోసం చేసిన ఖర్చుల కోసం వెచ్చించిన డబ్బులను లెక్కగడితే రూ.600 కోట్లు దాటిందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో రూ.100 కోట్ల వరకు అభ్యర్థులు ఖర్చు చేయగా జిల్లాలోని ఐదు నియోజకవర్గాలతో పాటు బాన్సువాడ నియోజకవర్గంలోని మండలాల్లో జరిగిన ఖర్చును పరిశీలిస్తే రూ.500ల కోట్లకు మించి ఎక్కువ ఖర్చు అయినట్లు తెలుస్తుంది.

ప్రతీ నియోజకవర్గంలో..

ఒక్కో అభ్యర్థి రూ.40 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు ప్రచారం జరుగుతుంది. ఎన్నికల నియమావళి ప్రకారం అభ్యర్థులు తమ ప్రచారం కోసం రూ.40 లక్షలు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంది. కాగా అన్ని పార్టీల అభ్యర్థులు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి ఖర్చుకు వెనుకాడకుండా వ్యవహరించడం విశేషం. ప్రచార సభలు, గ్రామాల్లో నిర్వహించే కార్నర్ సమావేశాలకు జన సమీకరణ కోసం రూ. కోట్లల్లో ఖర్చు చేసేశారు. మద్యం, మాంసం, ఇతరత్రా బహుమతులు అందించడంతో పాటు ఓటుకు ధర నిర్ణయించి డబ్బులు పంపిణీ చేశారు. అనేక చోట్ల ఒక్క ఓటు కోసం రూ.500ల నుంచి రూ. 2,500ల వరకు నగదును పంపిణీ చేసినట్లు ప్రచారం జరుగుతుంది. ఒక ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థి కేవలం ఓట్ల కొనుగోలు కోసం ఒకే రోజున రూ. 35 కోట్లు కుమ్మరించినట్లు వెల్లడైంది. అంటే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా అభ్యర్థులు శక్తివంచన లేకుండా డబ్బులు వెదజల్లారనే అభిప్రాయం వ్యక్తమైతుంది. 2018 ముందస్తు అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ఈసారి ఖర్చు రెట్టింపు అయినట్లు తెలుస్తుంది. ఓటుకు గతంలో రూ.200ల నుంచి రూ.500లు చెల్లిస్తే ఈసారి ఏకంగా రూ.2,500 వరకు చెల్లించడంతో ఈ ఎన్నికలు చాలా ఖర్చుతో కూడుకున్నవని స్పష్టమవుతోంది. పోటీలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు అందరూ కోటీశ్వరులు కావడంతో ఖర్చుకు ఎవరూ వెనుకాడలేదని తెలుస్తోంది. ఎన్నికల్లో ధన ప్రవాహంను అరికట్టడానికి ఎన్నికల కమీషన్ నిఘా బృందాలను ఏర్పాటు చేసినా ఆ బృందాలు మద్యం, ధన ప్రవాహంను అరికట్టడంలో విఫలమయ్యాయని చెప్పవచ్చు.



దొంకేశ్వర్‌లోని దత్తాపూర్ శివారులో ట్రాక్టర్‌తో పొలాన్ని దమ్ము చేస్తున్న రైతు

సాగుకు రైతన్న సన్నద్ధం

డొంకేశ్వర్(ఆర్మూర్) : ఎన్నికల ఘట్టం దాదాపుగా ముగియడంతో రైతులు యాసంగి సాగు పనులపై దృష్టి సారించారు. వానాకాలం పంట డబ్బులు కూడా చేతికి రావడంతో నాట్లు వేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. ఇందుకు పొలాల్లో నీళ్ల నింపి ట్రాక్టర్లతో దమ్ము చేయడం మొదలు పెట్టారు. పెరిగిన వరినారును కూడా సిద్ధం చేసి పెడుతున్నారు. వారం, పదిరోజుల్లో నాట్లు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు రైతులు ముందుగానే కూలీలను మాట్లాడి పెడుతున్నారు. అలాగే, సాగుకు అవసరమైన ఎరువుల కోసం సొసైటీలను సంప్రదిస్తున్నారు.



పెరుగుతున్న వరినారు

కౌంటింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు

- పనులను పరిశీలించిన కలెక్టర్, సీపీ
- స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన ఈవీఎంలు
- పరిశీలకులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్
- సీసీ కెమెరాల ద్వారా అనుక్షణం పర్యవేక్షణ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

సుభాష్‌నగర్ : ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఆరు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చారు. ఆయా సెగ్మెంట్ల నుంచి ఓట్ల లెక్కింపు కేంద్రాలైన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూంలో క్రమపద్ధతిలో అమర్చారు. ఈ సందర్భంగా శుక్రవారం అభ్యర్థుల ఏజెంట్లు, ఎన్నికల పరిశీలకుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్ వేశారు. జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి ఈ వీఎంల భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఎలాంటి గందరగోళం, లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సాయుధ బలగాలతో పహారా ఏర్పాటుచేశారు. స్ట్రాంగ్ రూంలతో పాటు వాటి పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు వీలుగా సీసీ కెమెరాలు అమర్చి, మానిటర్ల ద్వారా పర్యవేక్షిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలులోకి తెస్తూ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి ఇతరులెవరూ లోనికి వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది రాకపోకలకు, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం వేర్వేరు మార్గాలతో ఏర్పాటుచేసిన బారికేడ్లు పరిశీలించారు. అదనపు డీసీపీ జయరాం, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, మెప్మా పీడీ రాజేందర్ ఉన్నారు.

144 సెక్షన్ అమలు

- మద్యం షాపులు కూడా మూసివేత

ఖలీల్‌వాడి : నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాటు చేసినట్లు సీపీ కల్మేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈనెల 3న జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఆదివారం ఉదయం 6గంటల నుంచి 4న ఉదయం 6గంటల వరకు 144 సెక్షన్ అమ ల్లో ఉంటుందన్నారు. ఈ సమయంలో 5 మంది కంటే ఎక్కువ వ్యక్తులు గుమిగూడడాన్ని నిషేధించామన్నారు. ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నామన్నారు. గెలుపొందిన అభ్యర్థులు డిసెంబర్ 3న విజయోత్సవ ర్యాలీలు నిషేధమన్నారు. 4న ర్యాలీ నిర్వహణకు సంబంధిత పోలీస్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు.

ఈనెల 3న పాలిటెక్నిక్ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు హాజరయ్యే వారు నిర్దేశించిన ప్రాంతాలకు వెళ్లాలని సీపీ సూచించారు. ఈ ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి హాజర య్యే అధికారులు, అభ్యర్థులు, ప్రధాన ఏజెంట్లు కౌంటింగ్ ఏజెంట్లువారికి కేటాయించిన కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లాలన్నారు. జెడ్పీ నుంచి వెళ్లే మార్గం మూసివేస్తామని అలాగే కంఠేశ్వర్ రోడ్డు/ఉమెన్స్ కళాశాల రోడ్డు మూసివేస్తామన్నారు.

క్లుప్తంగా

4న రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం

నిజామాబాద్ సిటీ: హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 4న రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం, సరస్వతీరాజ్ హరిదా ప్రతిభా పురస్కారాల ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంఘం అధికార ప్రతినిధి నరాల సుధాకర్ శుక్రవారం తెలిపారు. మానిక్‌బండార్‌లో ఉన్న నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో సమ్మేళనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి, ప్రఖ్యాత రచయిత్రి అమృతలత తదితరులు హాజరవుతారని అన్నారు. జిల్లాలోని సాహిత్య అభిమానులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అటవీ భూమి పరిశీలన



డిచ్‌పల్లి: మండలంలోని నడిమితండా వద్ద ఉన్న అటవీ ప్రాంత భూమిని కొందరు అక్రమంగా దున్నగా అటవీశాఖ రేంజ్ అధికారి రవిమోహన్‌భట్ శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట సెక్షన్ అధికారి మానస, సాయికృష్ణ, బీట్ అధికారులు ప్రవీణ్, సాయికృష్ణ, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.

రేపు కృత్రిమ కాళ్ల పంపిణీ

నిజామాబాద్ సిటీ: దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నగరంలోని రోటరీ కార్యాలయంలో ఈ నెల 3న కృత్రిమ కాళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, నిజామాబాద్ రోటరీ సర్వీస్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రమాదాలు, అనారోగ్యరీత్యా కాలు కోల్పోయిన బాధితులు రోటరీక్లబ్ అందిస్తున్న కృత్రిమ కాళ్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 92469 90055 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎన్ ప్రసన్న కుమారి, కృత్రిమ కేంద్ర చైర్మన్ శ్రీరాం సోనీ, నిజామాబాద్ రోటరీ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ వేద్ ప్రకాష్ మిట్టల్, కార్యదర్శి జితేంద్ర మలాని, కోశాధికారి జ్ఞాన ప్రకాశ్, క్లబ్ కోశాధికారి ఇందూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయటే చదువులు


- ఒకే గదిలో 5 తరగతులు
- కిచెన్, బాత్రూంలు లేక ఇబ్బందులు



నస్రుల్లాబాద్(బాన్సువాడ): దుర్కి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గదుల కొరత ఉండటంతో ఒకే గదిలో 5 తరగతుల విద్యార్థులకు బోధిస్తున్నారు. కట్టెల పొయ్యి మీద వంట చేయడంతో పొగకు విద్యార్థులు ఇబ్బందులకు గురై ఆరుబయట చదువుతున్నారు. చుట్టు ఇళ్లు ఉండటంతో కనీస అవసరాలు తీర్చుకోవడానికి సైతం వీలు లేక ఇబ్బంది పడుతున్నారు. కిచెన్ షెడ్డు పూర్తిగా కూలిపోవడంతో వరండాలో వంట చేస్తున్నారు. దీంతో పొగ వల్ల విద్యార్థులు కళ్లు మండుతున్నాయని వాపోతున్నారు. సంబంధిత అధికారులు నాయకులు స్పందించి తమ సమస్యను తీర్చాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పోరులో గెలుపెవరిదో..

- పోలింగ్ సరళిపై అంచనా వేస్తున్న అభ్యర్థులు
- భవితవ్యాన్ని నిర్ణయించేది మహిళా ఓటర్లే..



ఆర్మూర్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్ పర్వం ముగియడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ ప్రచార అస్త్ర శస్త్రాలను చాలించుకొని తమ అనుచరగణంతో ఏ గ్రామంలో తమకు ఎన్ని ఓట్లు వస్తాయంటూ లెక్కలు వేయడం ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఐదు నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీ నెలకొనడంతో పోటీ రసవత్తరంగా సాగింది. ఆర్మూర్ నియోజకవర్గం నుంచి పదమూడు మంది అభ్యర్థులు బరిలో ఉండగా ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి మధ్యే పోటీ నెలకొంది. ప్రతి అభ్యర్థి తమకు పట్టు ఉన్న గ్రామాలతో పాటు నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఓటింగ్ సరళిని పోలింగ్ ఏజెంట్ల ద్వారా అడిగి తెలుసుకుంటున్నారు. గత ఎన్నికలకంటే ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గడం ఎవరి మీద ప్రభావం చూపుతుందోనన్న చర్చ జరుగుతోంది. మరో వైపు ప్రధాన పార్టీల అభ్యర్థులు నాయకులు అందించిన రిపోర్టుల ఆధారంగా తామే విజయం సాధిస్తున్నట్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

డబ్బులు, మద్యందే కీలకపాత్ర

ఎన్నికల్లో ప్రధానంగా డబ్బులు, మద్యం, విందులు కీలకపాత్ర పోషించాయి. మహిళా సంఘాలకు, మహిళలకు ఎన్నికల సమయంలో పంపిన డబ్బులు నేరుగా చేరినప్పటికీ పురుషుల ఓట్ల కోసం మద్యం, విందుల కోసం అభ్యర్థులు అనధికారికంగా రూ. కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. మద్యం, విందులతో ఎంజాయ్ చేసిన పురుషులు మాత్రం ఓటు వేయడానికి ఆసక్తి చూపలేదని ఎన్నికల పోలింగ్ సరళిని చూస్తే అర్థం అవుతోంది. ఇక అన్ని పార్టీల అభ్యర్థులు మహిళలంతా తమ వైపే ఉన్నారంటూ అందుకు తాము నామినేషన్ వేసిన, ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో తరలి వచ్చిన మహిళలే నిదర్శనమంటూ చెప్పుకొంటున్నారు. నిజానికి ఈ మహిళలంతా ఎవరికి పట్టం కట్టనున్నారో ఈ నెల 3న ఓట్ల లెక్కింపులో తేలనుంది.

మహిళా ఓట్లే ఎక్కువ

పోలింగ్ ముగిసే సమయానికి 1,59,804 ఓట్లు పోల్ కాగా అందులో 69,508 మంది పురుషులు, 90,296 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆరుగురు ఓటర్లు ఇతరులు ఉండగా వారు తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. మరో వైపు పురుష ఓటర్ల సంఖ్యతో పోలిస్తే మహిళలు 20,788 మంది ఎక్కువగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుష ఓటర్ల ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఆసక్తి చూపకపోవడం ప్రధానంగా చర్చనీయాంశమైంది.

హ్యాట్రిక్ విజయం సాధిస్తా



ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు ప్రజల అభిమానంతో హ్యాట్రిక్ విజయం సాధిస్తా. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ పాలనలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం. పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేస్తాం.

– ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఆర్మూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి

ప్రజలు మార్పు కోరుకున్నారు



బీఆర్‌ఎస్ అవినీతి పాలనతో నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా నా విజయాన్ని ఎవరూ ఆపలేరు. పార్టీకి సైలెంట్ ఓటింగ్ జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం.

– వినయ్‌రెడ్డి, ఆర్మూర్ కాంగ్రెస్ అభ్యర్థి

మోదీ మార్క్ పాలన కోసం



ప్రధాన మోదీ మార్క్ అవినీతి రహిత పాలన కోసం నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున బీజేపీకి ఓటు వేశారు. దేశం, ధర్మం కోసం ప్రజలు కట్టుబడి ఉన్నారు. ఎన్నికల్లో నాదే విజయం. బీజేపీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

– పైడి రాకేశ్‌రెడ్డి, ఆర్మూర్ బీజేపీ అభ్యర్థి

అభివృద్ధి పనులతో గెలుస్తా..



బాల్కొండ నియోజకవర్గంలో మూడోసారి భారీ మెజారిటీతో విజయం సాధిస్తా. బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులతోనే గెలుస్తాను. హ్యాట్రిక్ విజయం పక్కా.. ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేసిన వారందరికి కృతజ్ఞతలు.

– వేముల ప్రశాంత్‌రెడ్డి, బాల్కొండ బీఆర్‌ఎస్ అభ్యర్థి

చేసిన సేవలే గెలిపిస్తాయి



నియోజకవర్గ ప్రజలతో పదేళ్ల నుంచి ఎంతో అనుబంధం ఉంది. ప్రజల కష్ట సుఖాలను పంచుకున్నాను. ప్రజలకు చేసిన సేవలతోనే అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నాను. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కష్టం, బాల్కొండ ప్రజల ఆదరాభిమానాలతో విజయం సాధిస్తా.

– సునీల్‌కుమార్ రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి

మహిళల అభిమానంతో..



సాటి మహిళగా మహిళల సమస్యలను పరిష్కరిస్తాననే నమ్మకంతో మహిళా ఓట్లు నాకు పడ్డాయి. వారి అభిమానంతో ఖచ్చితంగా గెలుస్తాననే నమ్మకం ఉంది. బీజేపీ మహిళలపై ఎంతో సానుకూలంగా ఉంది. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించారు.

– ఏలేటి అన్నపూర్ణమ్మ, బాల్కొండ బీజేపీ అభ్యర్థి

నేటి నుంచి కాలభైరవుడి జన్మదిన వేడుకలు

- ఈ నెల 6 వరకు వివిధ కార్యక్రమాలు
- భారీగా హాజరుకానున్న భక్తులు

రామారెడ్డి: ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా పేరుగాంచిన ఇసన్నపల్లి(రామారెడ్డి) శ్రీ కాలభైరవుడు జన్మదిన వేడుకలు నేటి నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ వేడుకలకు రాష్ట్ర వ్యాప్తంగా భారీగా భక్తులు హాజరుకానున్నారు. నేటి నుంచి ఈ నెల 6న ఉదయం నిర్వహించే రథోత్సవం(దక్షయజ్ఞం)తో జన్మదిన వేడుకలు ముగుస్తాయి.

ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు

నేటి ఉదయం 6 గంటలకు గణపతి పూజ అనంతరం కాలభైరవుడికి సంతతధారాభిషేకంతో జన్మదిన ఉత్సవాలకు అంకురార్పణ నిర్వహిస్తారు. ఈ నెల 3న మధ్యాహ్నం 1 గంటలకు బద్దిపోచమ్మకు బోనాల సమర్పణ ఉంటుంది. 4న సాయంత్రం 6 గంటల నుంచి లక్ష దీపార్చన సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.



కాలభైరవుడి మూలవిరాట్



కాలభైరవుడి ఆలయం

క్రైం కార్నర్

బాలికపై అత్యాచారం

బిచ్కుంద: మండలంలోని ఓ గ్రామంలో ఆరేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై మురళి తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 29న ఇంటి ఎదుట ఆడుకుంటున్న బాలికకు సదరు యువకుడు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఈ విషయాన్ని తల్లితండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

గాంధారి: మండలంలోని కాటివాడి తండాకు చెందిన బానోత్ నరేశ్ (30) గురువారం రాత్రి బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో మృతిచెందినట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ శుక్రవారం తెలిపారు. నరేశ్ మరో వ్యక్తితో కలిసి గాంధారి నుంచి తండాకు వెళ్తుండగా పోతంగల్ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ నరేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి గాయాలు కావడంతో స్థానికులు బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దేవగిరి రైలులో బోధన్ చిన్నారులు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న ఇద్దరు చిన్నారులను రైల్వే పోలీసులు గుర్తించారు. బోధన్ పట్టణానికి చెందిన శివ చరణ్ (4), అన్విత (3)లు స్టేషన్‌లో అటూ ఇటూ తిరుగుతుండగా గుర్తించిన రైల్వే పోలీసులకు తాము బోధన్‌కు చెందిన వారిమని పేర్కొన్నారు. చిన్నారులు తమ తల్లితండ్రులు అనిత, రవి, నానమ్మ సాయమ్మ అని పోలీసులకు చెప్పారు. చిన్నారులు సికింద్రాబాద్ వెళ్లడానికి గల కారణాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. బోధన్ పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



విలేకరులతో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

- ఎన్నికల్లో కాంగ్రెస్‌కి ఓటేసిన వారికి కృతజ్ఞతలు
- మెజారిటీ.. మైనారిటీ అనే ఫీలింగ్ లేదు
- కాంగ్రెస్ అర్బన్ అభ్యర్థి షబ్బీర్ అలీ

ఖలీల్‌వాడి: తెలంగాణలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని మాజీ మంత్రి, కాంగ్రెస్ అర్బన్ అభ్యర్థి షబ్బీర్ అలీ ఆశాభావం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనపై ప్రజలు విసిగి మార్పు కోరుకుంటున్నట్లు తెలిపారు. నగరంలోని మారుతి నగర్‌లోని ఉన్న క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన వారికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కే ప్రజలు ఈసారి పట్టం కట్ట బోతున్నారని చెప్పారు. ఎగ్జిట్ పోల్స్ ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మెజారిటీ వస్తుందని చెప్పారు. 25 సీట్ల కంటే ఎక్కువ బీఆర్‌ఎస్‌కు రావన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ మూడో స్థానంలో ఉందన్నారు. అర్బన్‌లో మెజారిటీ కాంగ్రెస్‌కు కనివినీ ఎరుగని రీతిలో వస్తుందన్నారు. నియోజకవర్గంలో మెజారిటీ, మైనారిటీ అనే ఫీలింగ్ లేదన్నారు. సమావేశంలో మాజీ మేయర్ సంజయ్, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్, ప్రధానకార్యదర్శి నరాల రత్నాకర్, నగర అధ్యక్షుడు కేశ వేణు, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రామర్తి గోపి, భక్తవత్సలం, ఆదె ప్రవీణ్, కైసర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కాంగ్రెస్ విజయం ఖరారు..



మాట్లాడుతున్న మానాల మోహన్ రెడ్డి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

భీమ్‌గల్: జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పడుతున్న కష్టానికి ఈ ఎన్నికల్లో తగిన ప్రతిఫలం దక్కుతోందని అన్నారు. పదేళ్ల అవినీతి బీఆర్‌ఎస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఓటర్లను డబ్బుతో కొనాలని చూసినా ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా కాంగ్రెస్‌కే ఓటు వేసినట్లు చెప్పారు. పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శభాష్ నారాయణ..

రాజంపేట: ఎవరికైనా ఓ వంద రూపాయలు దొరికితే ఏం చేస్తారు కళ్లకు అద్దుకుని మరీ ఆ దేవుడే తనకు ఇచ్చాడంటూ సంబురపడి తీసుకుంటారు. కానీ తనది కానిది ఒక్క రూపాయి అయినా వద్దు అంటూ దొరికిన మూడు తులాల బంగారం ఉన్న పర్సును సదరు బాధితురాలి జాడ కనుక్కొని మరీ ఇచ్చి మానవత్వం చాటాడు ఓ హోటల్ యజమాని నారాయణ. వివరాలు ఇలా ఉన్నాయి. రాజంపేట మండలంలోని గుడితండాకు చెందిన రమావత్ జంకు కొండాపూర్ గ్రామంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌కు గోల్డ్ లోన్ కోసం వచ్చింది. చాయి తాగేందుకు బ్యాంక్ సమీపంలోని హోటల్‌కు వెళ్లింది. అక్కడ చాయి తాగి పర్సు అక్కడే మర్చిపోయింది. ఇది గమనించిన హోటల్ యజమాని నారాయణ పర్సులో ఉన్న ఫొటో ఆధారంగా బాధితురాలి జాడను కనుక్కొని బంగారం ఉన్న పర్సును అందజేశారు. ఆ పర్సులో మూడు తులాల బంగారం ఉందని బాధితురాలు పేర్కొంది. పోయిన బంగారం దక్కదేమో అనుకున్నా.. మానవత్వం ఇంకా బతికుందంటూ సదరు బాధితురాలు హర్షం వ్యక్తం చేస్తూ నారాయణకు కృతజ్ఞతలు తెలిపింది. ఇది చూసిన వారందరూ శభాష్ నారాయణ అంటూ అభినందనలు తెలిపారు.



బంగారాన్ని అందిస్తున్న నారాయణ

మధ్యాహ్నం.. అధ్వానం



ధర్మారావుపేట్ ప్రాథమిక పాఠశాల

- ఆరు నెలలుగా అందని బిల్లులు
- గుడ్డు ధర పెంచాలంటూ వేడుకోలు..
- ఇబ్బందుల్లో ఏజెన్సీ నిర్వాహకులు
- కొత్త జీతాలు కూడా అందని వైనం

సదాశివనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్నభోజన పథకం అభాసుపాలవుతోంది. విద్యార్థులకు భోజనం వండి పెడుతున్న నిర్వాహకులు పడుతున్న కష్టాలు వర్ణణాతీతం. ప్రతి నెల బిల్లులు అందక అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నారు. మండలంలోని 42 ప్రభుత్వ పాఠశాలల్లో 45 ఏజెన్సీలు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలల్లో పని చేస్తున్న నిర్వాహకులకు 9, 10వ తరగతులకు సంబంధించిన బిల్లు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. 1 నుంచి 8వ తరగతి వరకు మూడు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త జీతాలు కూడా అందడం లేదని వారు పేర్కొంటున్నారు. గత 6 నెలల నుంచి కోడి గుడ్డు బిల్లు అందకపోవడంతో కొన్ని పాఠశాలల్లో వారంలో మూడు సార్లు గుడ్డు అందించాల్సి ఉండగా దానిని నిలిపి వేస్తున్నారు. వారంలో మూడు సార్లు కోడిగుడ్డు పెట్టడం వల్ల తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు పేర్కొంటున్నారు. కొన్ని పాఠశాలల్లో వారానికి ఒకసారి కోడిగుడ్డును అందిస్తున్నారు. తమకు ప్రభుత్వం ఒక గుడ్డుకు రూ. 5 మాత్రమే చెల్లిస్తోందని తాము రూ. 6కు గుడ్డును కొంటున్నట్లు చెబుతున్నారు.

కట్టెల పొయ్యిలే దిక్కు..

వంట చేయడంతో శ్వాసకోశ సంబంధ వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంట చేయడానికి ప్రత్యేక గదిని నిర్మించాలని వేడుకుంటున్నా ఇప్పటికి గది మంజూరు కావడం లేదు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఐదేళ్ల క్రితం నామ మాత్రంగా నిర్మించిన వంట గదులు పనికి రాకుండా పోయాయి. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సరైన వసతులు లేకపోవడంతో ఇరుకైన గదులు, ఆరు బయట వంటలు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. గ్యాస్ నిర్వహణతో అధిక భారం అవుతోందని భావించిన ప్రభుత్వం పాఠశాలల్లో సిలిండర్‌పై వంట చేయడం ఎత్తి వేసింది. దీంతో నిర్వాహకులకు కట్టెల పొయ్యిలే దిక్కవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏజెన్సీ నిర్వాహకులకు ప్రత్యేక వంట శాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డబ్బులు అందడం లేదు



వారంలో మూడు సార్లు విద్యార్థులకు కోడిగుడ్డును అందించాలని అధికారులు చెబుతున్నారు. కానీ డబ్బులు మాత్రం ఇవ్వడం లేదు. అప్పులు చేసి మరీ కోడిగుడ్లు, వంట సామాగ్రి కొంటున్నాం. బిల్లులు సకాలంలో చెల్లిస్తే విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టొచ్చు.

– బాలమణి, ఏజెన్సీ నిర్వాహకురాలు, ధర్మారావుపేట్

ఇరుకు గదులతో ఇబ్బందులు



వంట చేసేందుకు సరైన గదులు లేవు. ఇరుకైన గదుల్లోనే వంట చేయాల్సి వస్తోంది. గ్యాస్ కొనడానికి డబ్బులు ఇవ్వడం లేదు. కట్టెల పొయ్యి మీదనే వండాల్సి వస్తోంది. విశాలమైన వంట గదులు నిర్మించాల్సిన అవసరం ఉంది. మేము పడుతున్న సమస్యను ప్రభుత్వం గుర్తించాలి.

– నర్సవ్వ, ఏజెన్సీ నిర్వాహకురాలు, ధర్మారావుపేట్

ఉన్నతాధికారులకు నివేదించాం

మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు కోడిగుడ్లకు సంబంధించిన డబ్బులు రాని మాట వాస్తవమే. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. నిధులు మంజూరు కాగానే నిర్వాహకులకు అందిస్తాం. అలాగే 9, 10వ తరగతులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి మంజూరుకు కృషి చేస్తాం. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు ఆందోళన చెందొద్దు బిల్లులు తప్పకుండా వస్తాయి.

– యోసెఫ్, మండల విద్యాశాఖ అధికారి